# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ:  18-09-2024          సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరును ఖరారు చేస్తూ రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకుంది.
- పోలీసు శాఖలో మౌలిక వసతులు పెంచేందుకు కృషి చేస్తున్నామని డీజీపీ ద్వారకా తిరుమల రావు తెలిపారు.
- దేశంలో వాతావరణ పరిస్థితులను ఖచ్చితంగా అంచనా వేయడమే మిషన్ మౌసమ్ ప్రాజెక్ట్ లక్ష్యమని కేంద్ర భూ విజ్ఞాన శాస్త్ర మంత్రిత్వశాఖ కార్యదర్శి డాక్టర్ ఎమ్.రవిచంద్రన్ పేర్కొన్నారు.
- తెలుగు రాష్ట్రాలకు ట్రైనీ ఐపీఎస్ అధికారులను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
- ప్రజలందరి భాగస్వామ్యంతోనే స్వచ్ఛ భారత్ లక్ష్యాలను చేరుకోగలమని విశాఖ జిల్లా కలెక్టర్ ఎమ్.ఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు.

=====================

రాష్ట్రంలో నూతన మద్యం విధానానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.  అదే విధంగా భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరును ఖరారు  చేస్తూ... నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని సచివాలయంలో  ఈ రోజు జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ వివరాలను సమాచార శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి పాత్రికేయులకు వివరించారు. వాలంటీర్ల వ్యవస్థ పునరుద్ధరణపై మరింత సమాచారం తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారని తెలిపారు. పోలవరం డయాఫ్రమ్ వాల్ నిర్మాణం సీడబ్ల్యూసీ సూచనల మేరకు పాత ఏజన్సీకే ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

=====================

పోలీసు శాఖలో మౌలిక వసతులు పెంచేందుకు కృషి చేస్తున్నామని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) ద్వారకా తిరుమల రావు తెలిపారు. ఏలూరులో ఈ రోజు పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ, పోలీసుల సంక్షేమం కోసం కొన్ని కార్యక్రమాలు చేపట్టామన్నారు. పోలీస్ క్యాంటీన్ల కోసం వర్కింగ్ క్యాపిటల్ కింద 4.7 కోట్ల రూపాయలు ఇచ్చామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే పోలీస్ శాఖ లక్ష్యమని, ప్రజలకు జవాబుదారీగా పోలీస్ వ్యవస్థ పనిచేస్తుందని పేర్కొన్నారు. కాగా, లైంగిక దాడులను నివారించే విషయంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని డీజీపీ తెలిపారు.

=====================

దేశంలో వాతావరణ పరిస్థితులను ఖచ్చితంగా అంచనా వేయడమే మిషన్ మౌసమ్ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశమని కేంద్ర భూ విజ్ఞాన శాస్త్ర మంత్రిత్వశాఖ కార్యదర్శి డాక్టర్ ఎమ్.రవిచంద్రన్ అన్నారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా వంద చోట్ల రాడార్లను అమర్చి అలా వచ్చే పరిశీలనలను క్రోడీకరిస్తామని తెలిపారు. వీటి ద్వారా భవిష్యత్తులో మెరుగైన అంచనాలను ఖచ్చితంగా ఇస్తామని తెలిపారు. విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వాతావరణ మార్పులు, సముద్ర అధ్యయనంలో వస్తున్న పరిణామాలు అనే అంశంపై జాతీయ సదస్సును ఈ రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రవిచంద్రన్ మాట్లాడుతూ... సముద్రయానం.. దానితో ముడిపడివున్న రంగాల నుంచి అందుతోన్న 4 శాతం జీడీపీని 8 శాతానికి పెంచడమే లక్ష్య మన్నారు.

=====================

రెండు తెలుగు రాష్ట్రాలకు ట్రైనీ ఐపీఎస్ అధికారులను కేటాయిస్తూ.. కేంద్ర ప్రభుత్వం ఈ రోజు ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి హరియాణాకు చెందిన దీక్ష, తమిళనాడుకు చెందిన సుష్మిత, ఆంధ్ర ప్రదేశ్ కి చెందిన బొడ్డు హేమంత్, మనీషా వంగల రెడ్డిలను కేటాయించింది. అదే విధంగా తెలంగాణ రాష్ట్రానికి జమ్మూకశ్మీర్‌కు చెందిన మనన్ భట్, తెలంగాణకు చెందిన రుత్విక్ సాయి కొట్టే, సాయి కిరణ్, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన యాదవ్ వసుంధరను కేటాయించారు.

=====================

ప్రజలందరి భాగస్వామ్యంతోనే స్వచ్ఛ భారత్ లక్ష్యాలను చేరుకోగలమని విశాఖ జిల్లా కలెక్టర్ ఎమ్.ఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. “స్వచ్ఛతా హి సేవ” పక్షోత్సవాలను ఈ రోజు ఆయన విశాఖలో ప్రారంభించారు. బీచ్ రోడ్డులో నిర్వహించిన పరిశుభ్రతా కార్యక్రమంలో విశాఖ నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కమిషనర్ సంపత్ కుమార్ లతో కలిసి పాల్గొన్నారు. జిల్లాలో 83 ప్రదేశాలను గుర్తించి.. రాబోయే రెండు వారాల్లో పరిశుభ్రతా కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్నామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొంటూ....

(వాయిస్ 27 సెకన్లు)

విరామం

=====================

విశాఖపట్నంలోని భారతీయ స్టేట్ బ్యాంక్ పరిపాలనా కార్యాలయంలో “జాతీయ పింఛన్ వ్యవస్థ” (ఎన్‌పీఎస్) వాత్సల్య పథకం గురించి అవగాహన కార్యక్రమం ఈ రోజు నిర్వహించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ రోజు దేశవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించారు. ఎస్‌బీఐ డీజీఎం పంకజ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని పథకం ప్రయోజనాలను వివరించారు. “ఎన్.పీ.ఎస్ వాత్సల్య పథకం” కింద సంవత్సరానికి కనీసం వెయ్యి రూపాయల చొప్పున పిల్లల పేరున పొదుపు చేయవచ్చని, ఇది వారి భవిష్యత్తుకు ఒక మంచి ఆర్థిక పునాది వేసే అవకాశాన్నిస్తోందని ఆయన పేర్కొన్నారు.

=====================

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో అన్న క్యాంటిన్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు తెలిపారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మునిసిపాలిటీలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ ను కలెక్టర్ విజయ కృష్ణన్ తో కలిసి ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 200 పైగా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వం ఆలోచన అన్నారు. పేదలకు అన్నాహారం అందించడమే ఈ పథకం లక్ష్యమని తెలిపారు.

=====================

పరిశ్రమలలో ఎటువంటి ప్రాణ నష్టం జరుగకుండా అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు సంబందిత అధికారులను ఆదేశించారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో కార్మిక శాఖ ఆద్వర్యంలో పరిశ్రమల నిర్వహణపై జిల్లా స్థాయి కమిటి సమావేశం జరిగింది. ఈ సందర్బంగా ఆయన పరిశ్రమలలో ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించాలన్నారు. అదే విధంగా జిల్లాలో గుర్తించిన 25 ప్రమాదకర పరిశ్రమలలో నిర్దేశిత ప్రణాళిక ప్రకారం సంబంధిత శాఖలు తనిఖీలు చేపట్టాలని సూచించారు.

=====================

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని విశాఖ మెట్రో రీజనల్ డెవలప్ మెంట్ ఆథారిటీ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్ అన్నారు. విశాఖపట్నంలోని కైలాసగిరి పర్యాటక క్షేత్రంలో విత్తనాలు జల్లే కార్యక్రమంలో ఆయన ఈ రోజు పాల్గొన్నారు ఈసందర్బంగా మాట్లాడుతూ, వాతావరణ కాలుష్యంతో పర్యావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. భూతాపం విపరీతంగా పెరిగి ప్రకృతి వైపరీత్యాలు తరచూ సంభవిస్తున్నాయన్నారు.

=====================

నిరుద్యోగ యువతకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా నైపుణ్యాన్ని పెంచుతామని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అన్నారు. తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగు అవుతాయని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గం భోగాపురం మండలంలో ఈరోజు నిర్వహించిన “మెగా జాబ్ మేళా” కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు.

=====================

సమాజంలో మానసిక దివ్యాంగులు గౌరవప్రదంగా జీవించాలని వైయస్సార్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వి.హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. మానసిక దివ్యాంగులను గుర్తించి పునరావాస కేంద్రానికి తరలించేందుకు ఏర్పాటు చేసిన అంబులెన్సు వాహనాన్ని ఈ రోజు ఆయన నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో ప్రారంభించారు.

=====================

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా అభ్యాసం దోహదపడుతుందని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరంలో ఈ రోజు సంకల్ప సమాధి యోగ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ... ఒత్తిళ్లు లేని జీవితం కోసం క్రమం తప్పకుండా యోగా సాధన చేయాలని కోరారు.

=====================

దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ వాయవ్య దిశగా వీస్తున్న గాలుల ప్రభావంతో ఉత్తర కోస్తా జిల్లాల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు ఒకటి లేక రెండు చోట్ల కురిసే అవకాశముందని అమరవతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో మోస్తరు వర్షాలతో పాటు.. బలమైన ఉపరితల గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది.

======================

కోటిపల్లి - నరసాపురం రైల్వే లైన్ ఎలైన్ మెంట్ ప్రకారం సర్వే చేసి పూర్తి వివరాలను సమర్పించాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులు ఆదేశించారు. కలెక్టరేట్ లో తహసిల్దార్లు ఆర్డిఓలతో ఈ రోజు నిర్వహించిన  సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైల్వే లైన్ ఏర్పాటుకు సమగ్రమైన నివేదికను రూపొందించాలని సూచించారు.

======================

తిరుమలలో టోకెన్లు లేని భక్తులకు 24 గంటల్లో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి  దర్శనం కలుగుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. నిన్న శ్రీవారిని 72 వేల 72 భక్తులు దర్శించుకోగా, వారు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం 4.16 కోట్ల  రూపాయలు వచ్చిందని టీటీడీ అధికారులు వెల్లడించారు.

======================

======================